"అమ్మా! నాన్నగారు వచ్చారు ఆఫీసు నుంచి" అంటూ కవిత సోమసుందరానికి ఎదురేగింది. చేతిలోని బ్రీఫ్ కేసుని టీపాయ్ మీదికి విసిరేసి, రిలాక్స్ చేసుకుంటూ సోఫాలో చేరగిలబడ్డాడు సోమసుందరం. ఫాన్ ఆన్ చేస్తున్న కూతురు కవితను ఉద్దేశించి, "కవితా! లెటర్సు ఏమైనా వచ్చాయా?" అంటూ ప్రశ్నించాడు. పతిదేవుని చెంతకు కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది సతీదేవి, సరస్వతి. కూతురు జవాబిచ్చే లోగా, "ఆఁ వచ్చాయండి. కవితా, డ్రాయరు సొరుగులో ఉంచాను, వెళ్లి పట్టా అమ్మా" అంటూ సరస్వతి కాఫీ సేవిస్తున్న భర్త ముఖంకేసి చూసింది. ఆవిడకి బోలెడన్ని పనులు. అందులోనూ మరునాడు శ్రావణ శుక్రవారం. ఇంట్లో కావలసినవన్నీ సమకూర్చుకోవాలి. కాఫీ త్రాగుతూనే లెటర్స్ని చింపాడు సుందరం. ఒకటి తమ్ముడి దగ్గరనుండి విశేషాలు చెపుతూనే తిరగేశాడు ఉత్తరాన్ని. ఖాళీ కప్పుని పట్టుకొని పోబోతున్న సరస్వతిని, "ఆగు" అంటూ సైగచేసి, "కవితా! ఓ స్వీట్ 'న్యూస్'" అంటూ కేకేశాడు.

"ఏమిటి, నాన్నా?" అంటూ పరుగున వచ్చింది కవిత. "సబితను కూడా పిలువు" అన్న నాన్నగారి కేకకి జవాబా అన్నట్లు, కవిత చెల్లెలు కూడా వచ్చి నాన్నగారి సోఫా మీద కూర్చుంది.

"నేను ఆ మధ్య చెప్పాను గుర్తుందా— అమెరికన్ యూనివర్సిటీ నుంచి విద్యార్థుల బృంద మొకటి మద్రాసు రానున్నట్లు? దానికి సంబంధించిందీ ఉత్తరం. వచ్చేవారంతా టీనేజ్ గర్ల్స్. ఒక్కొక్క విద్యార్థిని, ఒక్కొక్క ఫామిలీతో ఓ నెల రోజులు గడిపి మన జీవిత విధానాన్ని గురించి తెలుసుకుంటారు. అలా ఆతిథ్యమిచ్చే ఫామిలీస్‌లో మనదీ ఒకటి. మన అతిథి పేరు మిస్ సారా విలియమ్స్. ఈ అమ్మాయి మిషిగన్ యూనివర్సిటీలో, సోషియాలజీలో డిప్లమాకు చదువుతోందట. వచ్చే గురువారం ఈ పాటికి సారా మన ఇంట్లో ఉంటుంది. మనకంతా ఓ సరికొత్త స్నేహితురాలు.." కూతుర్లతో చెబుతూ భార్య వేపు చూశాడు సుందరం.

"అలాగా" అన్నట్లు చూసి, సరస్వతి తన పనిలోకి వెళ్లిపోయింది. "హాయ్, హాయ్" అంటూ గంతులేశారు అక్కాచెల్లెం డ్రిద్దరూ. "నాన్నగారూ! తనొక్కతే మన ఇంట్లో ఉంటుందా?" అంది ఆశ్చర్యంగా పన్నెండేళ్ల సబిత. "ఔనమ్మా" అన్నాడు సుందరం. "నాన్నగారూ, స్టేట్సు నుండి వచ్చే అమ్మాయి కదా, ఎంత స్టైల్‌గా ఉంటుందో!" అంటూ కవిత తన లంగా, ఓణీల వంక అయిష్టంగా చూసుకుంది. "మన ఇండియాలోనే అందరూ బెల్ బాటమ్స్, స్ట్రెచ్ పాంట్సు వేసుకుంటారు. అమ్మే ఎప్పుడూ ఈ లంగాలు కుట్టిస్తుంది. నాన్నగారూ, మమ్మల్నిచూసి ఆ అమ్మాయి నవ్వదూ?" పదహారేళ్ల కవిత ఆరోపణలో సోమసుందరానికి కొంచెం సత్యం కనిపించింది. నిజమే, ఎన్నో రకరకాల కొత్త డ్రెస్సులతో, డిజైన్లతో నేటి కాలపు బాలికలు నయనానందకరంగా కనిపిస్తున్నారు. కాని, ఈ సరస్వతి దంతా చాదస్తం. ఆడపిల్లలకి లంగా, ఓణీలే అందం అని వాదిస్తుంది. పైగా తన మాటే నెగ్గించుకుంటుంది.

"కవితా! మీ అమ్మ మాటలకేంగాని, నేను మిమ్మల్నిద్దరిని రేపు చెల్లారామ్‌కి తీసుకెడతాను. సరికొత్త డ్రెస్సులు కొనుక్కుందురుకాని. కనీసం పైవాళ్లు వచ్చినప్పుడన్నా మనం కొంచెం నాగరీకంగా కనిపించద్దూ? అయినా, యూరపియన్ కాన్వెంట్‌లో చదివే మీరు అమ్మమ్మల్లా డ్రెస్ చేసుకుంటే, స్టేట్సు అమ్మాయి నవ్విపోదూ!" తండ్రి వకాల్తాకి సంబరపడిపోయారు కూతుళ్లిద్దరూ. అప్పుడే లంగా, ఓణీలను విప్పి పారేసి, స్ట్రైట్ పాంట్సు, స్లాక్సులోకి వెళ్లిపోయినట్లు ఊహించుకొని సంబరపడిపోయారు.

"నాన్నా!" అంటూ చెంగున ఒడిలోకి దూకాడు, ఎనిమిదేళ్ల ప్రభు. ఉలిక్కిపడ్డారు ముగ్గురూ. "ఒరేయ్! ఇంతసేపూ ఎక్కడున్నావ్?" అంటూ కొడుకును దగ్గిరికి తీసుకున్నాడు సుందరం.

"ప్రభూ! చూడు, ఇకమీదట నాన్నగారిని 'డాడీ' అనాలి, తెలుసా? నాన్న — బొన్న అనకూడదు. అలాగే అమ్మని 'మమ్మీ' అనాలి" అంది కవిత, పాఠం నేర్పిస్తున్నట్లు.

"ఏం, ఎందుకూ?" అంటూ రెట్టించాడు పసివాడు. "కవితా! నేను చిన్నప్పుడే మీకు మమ్మీ, డాడీ అని నేర్ప ప్రయత్నించానమ్మా. కాని, మీ అమ్మే శుభ్రంగా తల్లిని, అమ్మా! అని నోరారా పిలవకుండా, మమ్మీ ఏమిటి మేకలాగ మేమ్మే అంటూ కొట్టేసింది. పోనీ, నన్నైనా డాడీ అని పిలవనీవే, సరూ, అంటే — డాడీ వద్దూ బోడీ వద్దూ, డాడీ కాస్తా 'దాడీ' అయి కూచుంటుంది అంటూ నా ప్రయత్నాన్ని విఫలం చేసింది. చూశావా ఇప్పుడు, ఈ గుంట వెధవ 'ఎందుకూ?' అంటున్నాడు!" సోమసుందరం (పాపం) వాపోయాడు. అతనికి చిన్నప్పటి నుండి విదేశ నాగరికతా వ్యామోహం ఎక్కువ. ఏరి కోరి విద్యాధికురాలిని, గ్రాడ్యుయేటు సరస్వతిని చేసుకున్నాడు. కాని, అదేమిటో ఖర్మ, సరస్వతి మొదటి నుండి సుందరం వెర్రి పోకడలకి వంత పాడక, ఒకే మారు మంగళ హారతి పాడేసింది. తను నమ్మిన హైందవ సంప్రదాయాలనే ఇంట ప్రవేశపెట్టి, అమలు పెట్టింది. కాని, ఇప్పుడు ఒక విదేశీయ బాలిక ఇంట అడుగు పెట్టబోతున్నది అనగానే సుందరంలో ఇన్నాళ్లూ అణగారిపోయిన విదేశ నాగరికతా వ్యామోహం వేయితలలు దాల్చింది. దానికితోడు కుమార్తెల ప్రోత్సాహము.

మన ఆచార వ్యవహారాలూ, కట్టుబాట్లూ మనకు వెగటుగా ఉన్నట్లు మాట్లాడడం ఒక కొత్త ఫాషన్. పాశ్చాత్య నాగరికతను అనుసరించి ఇదే కొత్త మార్పని ఊహించుకొనడం పరిపాటి. పాశ్చాత్య దేశాలవారు మన నాగరికతను అనుకరించి మనలను ఆశ్చర్యచకితులను చేస్తున్నప్పుడు...

సారా రాబోయే రోజును తలుచుకొని సుందరం, కవితా సబితలు ఎన్నో కలలు కన్నారు. ఇంటిలో చాలా మార్పులు తెచ్చారు. చాలా వాటిని సరస్వతి ఆమోదించ లేదు. కాని, బలం అవతలి పక్షం వారిది కావడం మూలాన మౌనంగా ఉండిపోయింది. "ఏమర్రా, నా వంటింటిని, పూజా గదిని మాత్రం వదిలి, మిగతా గదులను మీ ఇష్టమొచ్చినట్లు మార్చుకోండి. ఈ అలంకరణలు, అనవసరమైన వ్యయప్రయాసలు!" తన అభిప్రాయం వెలిబుచ్చింది సరస్వతి. 'మొహంజోదారో నాటి ఆడమనిషిరా, భగవాన్!' అనుకున్నాడు సుందరం.

ఖరీదైన తివాసీ డ్రాయింగురూమును అలంకరించింది. ఎనిమిది వందలు పెట్టి కొన్న ఓ డైనింగ్ టేబిల్ వంటింటి నానుకొని ఉన్న వరండాలో వెలిసింది— టేబిల్‌కి తగ్గ కుర్చీలతో సహా. ప్రతి గుమ్మానికి అందమైన కర్టెన్లు, గోడలకి వాల్ హాంగింగ్స్ వేలాడగట్టారు. పింగాణి క్రాకరీ సెట్టు, టీ సెట్టు, ఫోర్కులు, స్పూనులు మీట్ షెల్ఫ్‌లో అందంగా అమర్చారు. బాత్‌రూములో టబ్ కూడా పెట్టితే బాగుంటుందని అనుకున్నాడు సుందరం, కాని బడ్జెట్ అంగీకరించలేదేమో, ఆ ప్రయత్నాన్ని విరమించాడు. ఈ ఏర్పాట్లన్నీ చూస్తూ సరస్వతి నవ్వుకుంది. 'హిందూదేశ సంప్రదాయాలని, అలవాట్లని, జీవిత పద్ధతులని చూడడానికి రాబోతున్న విదేశ వనితలకి వీళ్లు చూపించబోతున్న దేమిటి — ప్చ్! వీళ్లపిచ్చే వీళ్లకానందం.' నిట్టూర్చింది సరస్వతి.

ఇంటిల్లిపాదికి బాత్‌రూమ్ శాండల్సు, పిల్లలకి నైట్ గౌనులతో సహా తెచ్చాడు సుందరం. ప్రభుకి సాక్సు, బూట్సు, డ్రెస్సులు అన్నీ సరికొత్తవి కొన్నాడు. వాడు అవన్నీ చూసుకొని మురిసిపోయి, సరస్వతిని మమ్మీ అని, సుందరాన్ని డాడీ అని పిలవడం మొదలెట్టాడు. కవితా, సబితా రోజు కొక్క డ్రెస్సు చొప్పున వేసుకొని ప్రాక్టీసు చేసుకుంటున్నారు. వాళ్ల అవతారాలను చూచి, ఒకందుకుమాత్రం సంతోషించింది సరస్వతి, రక్షించి జడలు కత్తిరించి బాబ్ చేసుకోలేదులెమ్మని.

అనుకున్న గురువారం రానే వచ్చింది. ఉదయం నుండి కవితా సబితలు నిరీక్షిస్తూ కూచున్నారు సారా కోసం. సుందరం కాన్సులేట్‌కి ఫోన్‌చేసి సారా సాయంత్రం నాలుగు గంటలకు రానున్నట్లు తెలుసుకున్నాడు. నాలుగున్నరయినా రాకపోవడంతో, "ఏమా?" అంటూ వీధి గుమ్మం కేసి నడిచాడు సుందరం. ఇంతలో డ్రాయింగ్‌రూమ్‌లో 'ట్రింగు, ట్రింగు' మంటూ ఫోను మోగింది. ఫోన్ రిసీవ్ చేసుకున్న సరస్వతి 'సారా' ఆ సాయంత్రం కాన్సులేట్‌లోనే ఉండిపోతున్నట్లు, మరునాడు—అంటే శుక్రవారం ఉదయమే కార్లో వాళ్ల ఇంటికి వస్తున్నట్లు చెప్పడంతో సుందరం చప్పబడిపోయాడు. స్ట్రెచ్ పాంట్లలో ఇరుక్కుపోయి నిరీక్షిస్తున్న కవితా సబితలు నిస్పృహలతో లోనికి నడిచారు.

శ్రావణ శుక్రవారం పూజ హడావిడిలో మునిగి తేలుతూంది సరస్వతి. కవితా సబితలు వెంట రాగా బయటకు నడిచాడు సుందరం. "సరూ, మేము తిరిగి వచ్చేటప్పటికి నువ్వు కూడా ఫారిన్ జార్జెట్ చీర కట్టుకొని రెడీగా ఉండు. మరీ ఏబ్రాసిలా, ముసలి ముత్తయిదువు లాగ చింకి చీరలో సాక్షాత్కరించకు. నేనూ, అమ్మాయిలూ స్వయంగా వెళ్లి

సారా విలియమ్స్

-ఎమ్. హేమలత

"సారాను పిలుచుకు వస్తాము." కారుతో వెళుతూ సరస్వతికి లాస్ట్ మినిట్ ఇన్‌స్ట్రక్షన్స్ జారీ చేశాడు సుందరం.

పోర్టికోలో కారు ఆగిన చప్పుడు విన వచ్చింది. అటెన్షన్‌లో నిలబడి ఉన్న నౌకరు కుర్రవాడు రంగడు పరుగున వెళ్లి కారు తలుపులు తెరిచాడు. సుందరమే ముందుగా దిగి, సారా కేసి చూస్తూ, "ఎస్, కమిన్ ప్లీజ్. హార్టీ వెల్‌కమ్ టు అవర్ స్వీట్ హోమ్!" అంటూ స్వాగత వచనాలు పలికాడు. కవితా, సబితా చిరునవ్వులతో ముందు నడుస్తుంటే, సారా మందహాస వదనంతో ఇంట్లోకి అడుగు పెట్టింది.

ఇంటి ముంగిట ఉన్న బృందావనంలోని తులసి మొక్కకి నీళ్లు పోయడానికి రాగి చెంబుతో సహా వచ్చిన సరస్వతి సారాని చూచి, "రా అమ్మా, రా!" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది. 'ఇదేమిటి — ఇంత చెప్పినా ఇలా ఉన్నావ్' అన్నట్లు కోపంగా చూశాడు సుందరం భార్యకేసి. తలంటి పోసుకున్న కురులు తడి తడిగా నుదురు కంటుకుపోయి ఉన్నాయి. పూజా పుష్పాలు కొన్ని సరస్వతి ముడిలో నుండి తొంగిచూస్తున్నాయి. ముఖం నిండా పచ్చటి పసుపు, నుదుటి మీద ఎర్రటి పెద్ద కుంకుమ బొట్టు. కట్టుకున్నది పాత పట్టుచీర, ఒక చేతిలో రాగి నీళ్లచెంబు, ఇంకొక చేతిలో రాగి పళ్లెంలో పూలు, పండ్లు, అగరువత్తులు —ఏమిటీ ఇవన్నీ అన్నట్లు సరస్వతి వంక చూస్తున్న సారాను ఉద్దేశించి, "షి ఈజ్ మై వైఫ్ — సరస్వతి" అన్నాడు సుందరం.

"అవర్ గెస్ట్ ఫ్రమ్ ద స్టేట్స్ మిస్ సారా విలియమ్స్." కంఠంలో కొంచెం కోపం పలికిస్తూ భార్య ముఖంలోకి చూశాడు సుందరం.

"అదేమిటండీ! వచ్చినప్పటి నుండి మీరు ఇంగ్లీషులో మాట్లాడుతున్నారు. నాకు తెలుగు వచ్చు. నేర్చుకున్నాను ఇక్కడికి వచ్చే ముందు" అంటూ స్వచ్ఛమైన తెలుగులో జవాబు ఇచ్చింది, ఆ అమ్మాయి. సారా తెలుగు ఉచ్చారణకి మెచ్చుకోకుండా ఉండలేకపోయింది సరస్వతి. రెండు మూడేండ్లు విదేశాలలో గడిపి వచ్చే తెలుగు వారికి పూర్తిగా ఉచ్చారణలో ఇంగ్లీషు ఆక్సెంటు వచ్చేస్తుంది. కొంతమంది అయితే పూర్తిగా తెలుగు మరిచిపోతారు (మరిచిపోయినట్లు నటిస్తారు). అటువంటిది ఈ అమ్మాయి తెలుగు పలుకులు విని ఎంతో సంబరపడిపోయింది సరస్వతి.

"వెళ్లమ్మా లోపలికి... ఇదో, నే నిప్పుడే వచ్చేస్తాను. కవితా, అమ్మాయికి స్నానం అదీ చూడు" అంటూ తులసమ్మ దగ్గరికి సాగిపోయింది, సరస్వతి. సుందరం తన గదిలోకి వెళ్లిపోయాడు. కించిత్ అసంతృప్తి అతని మనస్సులో చోటు చేసుకుంది.

సరస్వతి బ్రెడ్ టోస్టు చేసి ఇస్తుంటే సబిత అవన్నీ టేబిల్ మీద అమరుస్తూ ఉంది. సారా, కవితా కబుర్లు చెప్పుకుంటూ వచ్చి, టేబిల్ ముందు కూచున్నారు. సుందరం అప్పటికే టిఫిన్ తింటున్నాడు. అతనికి తొమ్మిది గంటలకే ఫాక్టరీ. ప్రభ ఎనిమిది గంటలకే కాన్వెంటు కెళ్లాడు. అందరికీ బ్రెడ్ కాల్చడం, అయ్యాక, సరస్వతి కూడా వచ్చి టేబిల్ ముందు కూచుంది. "మీరు ఏమీ తినరా?" అంటూ ప్రశ్నించింది సారా. "ఎందుకు తిననమ్మా— తింటాను. మీ టిఫిన్ కానివ్వండి. నా దేముందిలే" అంది సరస్వతి. "ఉహుఁ అలాగ కాదు. మీరు కూడా తినాలి" అంటూ తన ఆమ్లెట్ ప్లేటుని, బ్రెడ్ టోస్టుని సరస్వతి దగ్గరికి తోసింది సారా. ఇక ఊరుకుంటే లాభం లేదని, "ఈ రోజు శుక్రవారం కదా? నేను నాన్-వెజిటేరియన్ ఫుడ్ తినను" అంది. "అలాగా!" అంటూ కొంచెం ఆశ్చర్య

పోయింది. "వై సో? ఒక్క ఫ్రైడే ఎందుకు సెలెక్టు చేసుకున్నారు?" అంది. సరస్వతి నవ్వేసి, "ఈ శుక్రవారాలు పూజలు చేసి, దేవుణ్ణి ప్రార్థించి, ఇలా ఒక్క పొద్దులు ఉంటే, భర్త ఆయుష్షు పెరుగుతుందని మాలో ఒక నమ్మకం. అంతే" అంది.

"అయితే మీ రేం తింటారు?"

"దేవుడికి నైవేద్యం పెట్టిందే!"

"నైవేద్యం అంటే!"

"పాలతో, నగ్గు బియ్యాలతో పర మాన్నం చేస్తాం. అదో ... ఇంకేదైనా దేవుడికని శుచిగా, ప్రత్యేకంగా చేస్తాం. ఈ రోజు కొద్దిగా చక్కెర పొంగలి చేశాను."

"చక్కెర పొంగలా! అదెలా ఉంటుం దండీ?" ఆసక్తిగా అడిగింది సారా. సరస్వతి చక్కెర పొంగలి తేవడానికి లేచి వెళ్ళింది.

"కవితా! వాట్ డు యు కాల్ యువర్ మదర్? ఐ టూ వాంట్ టు కాల్ హర్ లైక్ దట్" అంది సారా బ్రెడ్ టోస్ట్ తింటున్న కవితకేసి చూస్తూ.

"సింపిల్. ఉయ్ కాల్ హర్ మమ్మీ" అంది కవిత.

"వాట్! మేము మమ్మీ అంటాము. మీరూ అలాగే పిలుస్తారా? మీ భాషలో తల్లి అంటారు కదా?" ఆశ్చర్యపోయింది సారా. సుందరానికి సిగ్గుతో తల భూమి లోకి పోతుందేమో అనిపించింది.

"ఎక్స్‌క్యూజ్ మీ. నాకు ఆఫీసు టయి మయింది" అంటూ లేచి పోయాడు.

వాళ్ల సంభాషణ వింటూ వచ్చిన సరస్వతి, "ఏముంది, ఇక్కడి పిల్లలు తల్లిని అమ్మా! అని పిలుస్తారు" అంటూ కూతుళ్ల సంకటావస్థను తప్పించింది.

"అమ్మ ... అమ్మా! హౌ స్వీట్! మీకేమి అబ్జెక్షన్ లేకుంటే, మేము కూడా మిమ్మల్ని అమ్మా అంటాము. ఏమమ్మా!" అంది, ఎంతో సంబరంగా సారా. తన కూతురే ఇంకో రూపంలో సాక్షాత్కరించిందా అన్నంత ఆనందం కలిగింది సరస్వతికి. "అలాగే పిలు, సారా" అంటూ చక్కెర పొంగలి ఆ పిల్ల ప్లేట్లో వడ్డించింది. తనూ ఒక ప్లేట్లో పొంగలి తెచ్చుకొని, పీట వాల్చుకొని కూర్చుంది సరస్వతి.

"హౌ స్వీట్! కస్టర్డ్ కన్నా కూడా చాల నైస్‌గా ఉంది. అమ్మా! ఇదెలా చేస్తారో నాకు నేర్పించరూ! ఈ స్వీట్ డిష్‌ని చేసి మా దేశంలో మా ఫ్రెండ్సుకి తినిపిస్తాను." లొట్టలు వేసుకుంటూ చక్కెర పొంగలిని తింటున్న సారాని, బ్రెడ్ టోస్టుని స్టైల్‌గా ఫోర్కు, స్పూన్లతో తింటున్న కూతుళ్లని మార్చి మార్చి చూసి, మనస్సులోనే నవ్వుకుంది సరస్వతి.

స్కూలుకి టైమయిందని కవితా సబితలు వెళ్లిపోయారు. ఇక సరస్వతి వెంబడి తిరుగుతూ బోలెడు ప్రశ్నలతో తన సందేహాలని తీర్చుకోసాగింది సారా. "అమ్మా! ఇక్కడ ఏమి పెయింట్ వేశారు" అంటూ గుమ్మాలు చూపించింది. అది పసుపు కుంకుమ అని, ప్రతి శుక్రవారం అలా పెట్టడం రివాజు అని బోధపరిచింది సరస్వతి. వాకిట్లో పెట్టిన ముగ్గులను చూసి, "అబ్బ! ఎంత ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి!" అంటూ మురిసిపోయింది, సారా. ప్రతిదీ 'నాకు నేర్పవూ' అంటూ అడగడం సరస్వతికి ముచ్చటేసింది. ఎంతసేపూ చదువులూ, కాకుంటే సినిమాలూ, స్నేహితులే తప్ప మరో ప్రపంచంతో నిమిత్తం లేనట్లు వ్యవహరించే పుత్రికారత్నాలని తలుచుకొని కాసింత నిట్టూర్చింది సరస్వతి.

ఫాక్టరీ నించి సుందరం వచ్చాక సినిమా, సినిమా అంటూ పిల్లలు గొడవ చేయసాగారు. "ఓ ఎస్, ఉయ్ షెల్ గో టు ఆనంద్! మాంచి ఇంగ్లీషు పిక్చర్ ఆడుతోంది ఆ థియేటర్లో" అన్నాడు సుందరం. "పిక్చరా! వై నాట్ టు సమ్ డాన్స్ పర్‌ఫార్మెన్స్!" అంది సారా. కవిత ఆ దినం పేపరు తెచ్చి తిప్పి అన్నామలై మన్రమ్‌లో శ్రీమతి వసంత లక్ష్మి నరసింహాచారి కూచిపూడి నృత్య ప్రదర్శన ఉందంటూ అనౌన్సు చేసింది. ఓకే వెళదామనుకున్నారు అందరూ.

కవిత, ఫ్లోరల్ డిజైను ఉన్న లుంగిని చుట్టి, పైన జుబ్బాలాంటిది ధరించి ఒయ్యారంగా నడిచి వచ్చింది. సబిత బెల్ బాటమ్స్, స్లీవ్‌లెస్ స్లాకు ధరించి నాన్న గారి చెంత సాక్షాత్కరించింది. వాళు టిప్‌టాప్‌గా తయారై వచ్చాడు. ఇక సారాదే ఆలస్యం. "మీ అమ్మ ఏదర్రా?" అన్నాడు సుందరం. "ఇదుగో, వస్తున్నా నండి" అంటూ సారా గదిలో నుండి జవాబిచ్చింది సరస్వతి. కాస్సేపటికి ముద్దులు మూటగట్టే అందాల సారాతో సహా ఇవతలకి వచ్చింది సరస్వతి. కవితా సబితలు సారాని చూసి విస్తుపోయారు. సుందరం అయితే విశ్వేష్టుడే అయ్యాడు.

"ఏమ్ ఐ లుకింగ్ ఫెయిర్!" అంది నవ్వుతూ సారా. కవిత కంచి పట్టు లంగా, ముదురు నీలం రంగుది, కట్టుకొంది సారా. బిగుతయిన బ్లౌజ్ వోణీ వేసి, మాచింగ్‌గా లైట్ ఎల్లో ఓణీ వేసింది. మెడలో ముత్యాల దండ, చేతులనిండా గాజులు (చెవిలోకూడా ఏమైనా వేసుకోవాలని సంబర పడింది కాని, కన్నా లుంటేగా? అందుకని వీలుపడలేదు). పద్ధెనిమిదేళ్ల సారా ఆ డ్రెస్‌లో పద్ధాలు గేళ్ల పిల్లలాగా ఉండి, అసలు హిందూ కన్యలాగా కనిపించింది. పెద్దగా అలవాటు లేని డ్రెస్సులో పిల్లలందరూ తడబడు తుండగా, సరస్వతి గ్రహించినదై, "సారాకి ఓ ఫోటో తీద్దామర్రా. ఎంత చక్కగా ఉందో ఈ డ్రెస్సులో!" అంటూ హాస్యమాడేసింది.

అన్నామలై మన్రంలో నర్తకీమణి కూచిపూడి నృత్య ప్రదర్శనను చూచి సరస్వతి, సారాలు చాలా ఆనందించారు. సోమసుందరానికి ఇటువంటివి ఎప్పుడూ ఇష్టం ఉండవు. పాపం, ఏవో కంపెనీకోసమని రాక తప్పింది కాదా మానవుడికి. ఇక కవితా సబితలా? పెద్ద అయిష్టం కాకపోయినా, అలవాటు లేని బట్టలలో ఇరుక్కొని, స్వేచ్ఛగా లంగాలో మసిలే సారాని ఎన్వీ చేస్తూ గడిపేశారు. పైగా వచ్చిన వారందరు సారాని ఆ డ్రెస్సులో లైక్ చేస్తూ, తమని జుగుప్సగా చూసినట్లు కూడా ఫీల్ అయ్యారు.

* * *

ఆ రోజుకి సారా వాళ్లు వచ్చి సరిగా పదిహేను రోజులయింది. అమ్మాయి లందరూ కలిసి (అమెరికన్) మెరీనాకు ఎదురుగా ఉన్న యూనివర్సిటీ హాల్లో ఆ మధ్యాహ్నం ఓ చిన్న కల్చరల్ ప్రోగ్రామ్ ఇస్తున్నారు. ఆహ్వానితులు ముఖ్యంగా అమెరికన్ కాన్సులేట్‌లో పని చేసేవారు. సారా — కవిత, సబితలను తనతో తీసుకువెళ్లేందుకు సరస్వతి అనుమతి తీసుకుంది. "మీరూ రాకూడదా, అమ్మా!" అంటూ సారా సరస్వతిని ఆహ్వానించింది. "అలా కాదు కాని, సారా, ఒకటి చేయి. మీ ఫ్రెండ్సు నందరిని మనింటికితీసుకురా, ప్రోగ్రామ్‌అయ్యాక" అంది సరస్వతి. "ఓ కే" అంటూ పోలో మని బయటకు దూకారు అమ్మాయిలు ముగ్గురూ. ప్రత్యేకంగా వచ్చిన బస్సులో ఎక్కి కూర్చుంటూ సారా, "అమ్మా" అంటూ సరస్వతిని కేకేసింది. బయటకు పరుగున వచ్చిన సరస్వతి ముఖంలోకి సవినయంగా చూస్తూ, "సక్కెర పొంగలి, ఇఫ్ యు డోంట్ మైండ్" అంది. "భలేదానివే ... తప్పకుండా" అంటూ లోనికి వెళ్లిపోయింది సరస్వతి.

* * *



మిలమిలలాడుతూ గలగలా గదిలోకి ప్రవేశించారు పదిమంది ఆడపిల్లలు. ఏర్పాట్లకోసమని ముందుగానే వచ్చిన కవితా, సవితలు ఎదురేగి వాళ్ళని ఆహ్వానించారు. ఇంతలో సరస్వతి కూడా వచ్చింది. వచ్చిన అమ్మాయిల నందరిని సరస్వతికి పరిచయం చేసింది సారా.

"మిస్ విన్నీ, మిస్ వందా, మిస్ జోనా, మిస్ సిస్సీ, మిస్ పమేలా, మిస్ జమీనా, మిస్ కమిల్లా, మిస్ తెరేషా, మిస్ జెన్నిఫర్...

మై హోస్టెస్ మిసెస్ సరస్వతి, బి. ఎ."

పరిచయా లయ్యాక అందరూ సోఫాలలో కూచున్నారు. ఒక పిల్ల కండ్లు ఆకుపచ్చ రంగులో మిలమిలా మెరిసిపోతుంటే, ఇంకొక అమ్మాయి జుట్టు తేనె వర్ణంలో ధగధగ మంటూంది. అన్నెము, పున్నెము ఎరగని కన్నెపిల్లలు. ఏ ఊరు అయితే నేమి, ఏ దేశ మయితే నేమి? వారి ఉత్సాహము, హుషారు చూస్తే సరస్వతికి పట్టరానంత ఆనందం కలిగింది. కన్న తల్లితండ్రులను వదిలి పరాయి దేశానికి వచ్చిన వీళ్ళకి ఆదరణలో ఏ లోటూ రాకూడదు.

ఇక వాళ్ళు ఉన్నది ఒక్క పూటే అయినా, సరస్వతికి ఊపిరాడనంత పని. గలగల ప్రవహించే సెలయేరు కయినా కొంత నిశ్చలత ఉంటుందేమో కానీ, ఈ పరవళ్ళు తొక్కే కన్నె పరువానికి ఉండదేమో! అందులో ప్రతిదీ తెలుసుకోవాలన్న ఉత్సుకత వారిలో ఉట్టిపడుతూంది. వాళ్ళ వాళ్ళ హోస్టెసెస్‌ని గురించి ఎంతో గొప్పగా చెప్పుకున్నారు. ఒక అమ్మాయి అయితే, వాళ్ళ హోస్టెస్ ది పట్టుచీర సింగారించుకొని వచ్చింది. అక్కడ ఆవిడ కుదురుగానే కట్టి పంపింది. కాని, ఇక్కడ ఆ అమ్మాయి పమిట సవరించడం సరస్వతి డ్యూటీ అయి కూచుంది.

ఇల్లంతా కలియ తిరిగారు. ఆఖరికి పూజా మందిరంలోకి కూడా ప్రవేశించి, పూజా విగ్రహాలని ఎంతో భక్తి శ్రద్ధలతో చూసి, 'ఆర్టిస్టిక్‌గా ఎంచక్కా అరేంజ్ చేశారు' అంటూ మెచ్చుకున్నారు. ఇక బీరువాలోని చీరెలన్నీ కలగాపులగం చేసేసి, వాళ్ళ వాళ్ళ దేశాలకు వెళ్ళాక కొనవలసిన చీరల జాబితాలను ఏకరువు పెట్టారు. అందులో ఒక అమ్మాయి—"ఆంటీ! మీ ముక్కుకి ఉన్నదే ... అదేమిటి?" అంటూ సరస్వతి ముక్కుపుడక మీద పట్టించింది. సీల తిప్పి, తీసి చూపింది సరస్వతి. "మార్వెలస్, వండర్‌ఫుల్ ..." అంటూ దాన్ని ముక్కుకి పెట్టుకొని అద్దంలో చూసుకుంటూ సంబరపడిపోయారు. ముక్కులు కుట్టి ఉన్నా, కన్నాలు కనపడేటట్లు ముక్కుపుడకలు తీసేసి బోసి ముక్కులతో తిరిగే మన దేశపు స్త్రీలు ఎందరో సరస్వతి కండ్లముందు సాక్షాత్కరించారు.

"రండమ్మా, టిఫిన్ తిందురుకాని." ఆహ్వానించింది సరస్వతి. డైనింగ్ టేబిలు మీద పెద్ద పెద్ద పళ్ళెరాల్లో ఆవడలు, చక్కెర పొంగలి, కట్లెట్స్ కనిపిస్తున్నాయి. సారా చక్కెర పొంగలిని అందరి ప్లేట్లలోకి వేస్తూ, "ఐ లైక్ ఇట్ వెరీ మచ్ ..." అంటూ ఆప్యాయంగా సరస్వతి ముఖం వంక చూసింది. "ఇవి కూడా వడ్డించమ్మా" అంది సరస్వతి, ఆ వడలకేసి చూపుతూ.

"ఈ వడలు ఇంత గుండ్రంగా ఎలా

ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే

టూత్ పేస్ట్ –నీమ్

నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమే గాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణచేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.

కలకత్తా కెమికల్ వారి ఉత్పత్తి

వచ్చా యబ్బా! మధ్యలో కన్నం ఎలా వచ్చింది..." ఆవడలు తింటూ అమెరికన్ అమ్మాయిలు సందేహాలు వెలిబుచ్చారు. టిఫిన్లు తిని చాకలేటు టీ త్రాగి మళ్ళీ బిలబిలా పరుగెత్తారు డ్రాయింగ్ రూమువేపు, చూస్తూ చూస్తూ వదిలి వచ్చిన ఆల్‌బమ్ కోసం. ఆల్‌బమ్ పేజీలు తిప్పుతూ ఒక చోట ఆగిపోయింది ఓ అమ్మాయి. "ఆంటీ! ఇలా కాలి వేళ్ళకి వైట్ రింగ్స్ ఎందుకు వేసుకుంటారు!" ఆశ్చర్యంగా అడిగింది. "వాటిని మట్టెలంటారమ్మా! పెళ్లి అయిన వాళ్ళే వేసుకుంటారు" అంది సరస్వతి. "మరి పెళ్ళయిన మా హోస్టెస్ మిసెస్ సుభద్ర వేసుకోలేదేం!" అలాస్కా అమ్మాయి మిస్ కమిల్లా సందేహం వెలిబుచ్చింది.

"వేసుకోకపోవడం ఫాషన్ కాబోలు!" అంది సరస్వతి, ఏమనాలో తోచక. "కాలికి ఉండేవే కదా ... ఫాషన్‌కి ఎలా అడ్డువస్తాయి? అవి వేళ్ళకి ఎంత అందంగా ఉన్నాయో!" అంది టెక్సాస్ యువతి మిస్ జోనా.

"ఆంటీ, ఈవిడ ఎవరు?" అంటూ ఓ ఫోటో చూపించింది మిస్ పమేలా. "అదా! ఆవిడ మా హస్బెండ్‌కి చెల్లెలికి మదర్-ఇన్-లాకి చెల్లెలు కూతురు" అంది సరస్వతి. ఆ తిరుగుడు వ్యవహారం బోధపడని మిస్ పమేలా, "ఓ గాడ్ ... అంత దూరపు బంధువుని మీరు గుర్తుపెట్టుకుంటారా! మా కయితే ఒక్క తల్లి, తండ్రి తప్ప ఇంకెవరితో పరిచయమే ఉండదు" అంది. "మా కలా కాదమ్మా. మా దేశంలో బంధుప్రేమలు ఎక్కువ" అంది సరస్వతి. "మీ రెలాగయినా చాలా ఆఫెక్షనేట్ పీపుల్" అంది సారా మెచ్చుకోలుగా.

సాయంత్రం ఆరు కావచ్చింది. అమ్మాయి లందరూ తోటలోకి బొరబడ్డారు విరిబాలల్లాగ. సన్నజాజులు, విరజాజులు, కనకాంబరాలు గుంపులు పోసి చుట్టూ కూచున్నారు. "అబ్బ! ఈ ఫ్లవర్స్‌కి ఎంత స్వీట్ స్మెల్! అందుకే మీరు జడ వేసుకొని పువ్వులు పెట్టుకుంటారు, అందంగా" అంది సారా, కవిత కేసి చూస్తూ. మాల కడుతున్న సరస్వతిని కన్నార్పకుండా చూశారు పిల్లలు. "అరెరే ...! ఎలా వేస్తారు నాట్? మాకు నేర్పండి" అంటూ గోల. నేను వేస్తానని చేతికి తీసుకొని పూలని వడివిడికి తెంపేశారు. "వద్దు, వద్దు. ఆంటీ కడుతుంటే చూద్దాము" అంటూ మేజిక్ చూస్తున్నంత ఉత్సుకతతో చూశారు. పిల్లలందరూ మొహాలు కడుక్కున్నాక, వాళ్ళకి రకరకాల బొట్లు పెట్టి, దిల్వులతో జుట్టు కట్టి, పువ్వులు



పెట్టింది సరస్వతి. 'హా నైస్!' అనుకుంటూ ఆనందపడిపోయారు అమాయిక బాలికలు.

'మనం వెళ్ళేలోగా ఇంకొక్క రోజు ఆంటీతో స్పెండ్ చేయాలి' అనుకుంటూ పిడోల్కలు తీసుకొని సాగిపోయారు మిగతా పిల్లలందరూ. సారా మాత్రం ఉండిపోయింది.

"కవితా! ఈ రోజే కదూ సాంబశివరావుగారి అమ్మాయి పెండ్లి?" అంటూ వచ్చింది, కవితా వాళ్ళ గదిలోకి సరస్వతి. కవిత లేచి పక్క సర్దుతూంది. సారా లేచి కండ్లు తెరిచి సరస్వతిని చూచి, "గుడ్ మార్నింగ్!" అని నవ్వింది.

ఇంతలో కవిత—"ఎస్... ఎస్... మరిచాను. ఈవేళే. పది గంటలకు" అంది. "మరి నువ్వూ, సబితా వెళతారా? మీ నాన్నగారికి అనుకోకుండా ఫాక్టరీ నుండి ఎవరో విజిటర్స్ వచ్చారంటూ ఫోన్ కాల్ వచ్చింది. వారు వెళ్ళారు" అంది సరస్వతి. "మరి నువ్వు రావా?" అంది కవిత, బ్రష్‌మీద పేస్టు వేసుకుంటూ. "నాకెలా తీరుతుంది... మీ నాన్నగారు భోజనానికి ఎన్ని గంటలకు వస్తారో? మీ రిద్దరూ వెళ్ళి రండి. అన్నట్లు సారాను కూడా తీసుకెళితే? ఏమమ్మా, సారా, వెళతావా?" అంది సరస్వతి. ఒక్క గెంతు గెంతింది సారా పక్కమీది నుండి. "హౌ స్వీట్! నేను ఎన్ని దినాల నుండో అనుకుంటున్నాను, హిందూ మేరేజి చూడాలని. ఇదో వన్ మినిట్" అంటూ బాత్‌రూమువేపు దూసుకు పోయింది సారా. సారా చిలిపిచేష్టలకు నవ్వుకుంటూ సరస్వతి వంటగదికేసి నడిచింది.

టాక్సీ హబీబుల్లా రోడ్డు మలుపు తిరిగి, ఎస్. జి. ఎస్. సభ వద్ద ఆగింది. సారా, కవితా, సబితా టాక్సీలోంచి దిగారు. భాగ్యవంతుల పెండ్లి కాబోలు చెప్పలేనంత ఆర్భాటం. బాండ్ మేళం, ప్రఖ్యాత వాద్యకారుని సన్నాయి అహూతులను ఆకర్షిస్తున్నాయి. కవిత సారాకేసి చూస్తూ, "ఇదుగో — ఈ ఎదురుగా ఉన్న బిల్డింగ్ లేదూ? అది ప్రఖ్యాత సినీ నటులు రంగారావుగారి ఇల్లు" అంది. "అహా ..." నొసలు ఎగరేస్తూ అంది సారా. ఇంతలో చక్కగా ముస్తాబయిన ముగ్గురు వనితలు వచ్చి ఈ ముగ్గురమ్మాయిలను లోనికి తీసుకు వెళ్లారు. పెండ్లి మండపం ద్వారం వద్ద నిలబడి ఉన్న కొందరు సుందరాంగులు, వచ్చిన ఆడవారికి గంధం పూస్తూ, ఒంటిపై పన్నీరు చల్లుతూ, పువ్వుల బుకేలు చేతి కందిస్తున్నారు. కవితా, సబితలతోపాటూ సారాను కూడా లోనికాహ్వానించారు పెండ్లి పెద్దలు. పెండ్లి కొడుకు కాశీయాత్రకు కాబోలు వెళుతున్నాడు. చేతిలో గొడుగు, కాళ్ళకి కాశీ చెప్పులు, భుజానికి ఎర్రటి గుడ్డలో జోలె. పెండ్లి కొడుకుని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయింది సారా. "అదేమిటి — అతనే కదా పెండ్లికొడుకు? మరి వెళ్లిపోతున్నాడేం?" అంటూ కవితను ప్రశ్నించింది. కవితకే కూడా కొంత అయోమయంగా ఉండి, ఏమీ సమాధానం చెప్పలేకపోయింది. పక్కనే ఉన్న ఓ ముసలావిడ, పెండ్లికొడుకు కాశీయాత్ర ప్రయాణం పెండ్లిలో అవలంబించబడే సంప్రదాయం మాత్రమే అని, పెండ్లికొడుకు నాలుగు అడుగులు కూడా వేయడని, పెండ్లి కుమార్తె అన్న పెండ్లి కొడుకు కాళ్ళు కడిగి, ఎలాగూ వేదిక పైకి తీసుకువస్తాడని చెప్పింది. సారాకి వింతగా, చాలా తమాషాగా అనిపించింది.

పెండ్లి కుమారుణ్ణి జాగ్రత్తగా గమనించ సాగింది. మాంగళ్యధారణ అప్పుడు పెండ్లి కూతురు సిగ్గుతో తల వాల్చడం, పెండ్లి కొడుకు వంగి మంగళసూత్రం మూడు మూర్లు ముడివేయడం—అంతా చాలా గమ్మత్తుగా అనిపించినా, ఆ ఘట్టం సారా కన్నె హృదయంలో ఏదో చెప్పలేని పవిత్రతని కలిగించింది. ఇక తలంబ్రాలు పోసుకోవడం మొదలయింది.

సారాకి ఈ తతంగం మాత్రం ఎందుకో నచ్చలేదు. "ఎందు కిలా రైస్ వేస్టు చేస్తున్నారో!" ఉండబట్టలేక పక్కనున్న ముసలావిడని అడిగింది. ఆవిడకి ఈ పిల్ల వాలకం కొంచెం కోపం కలిగించింది. "అది శుభసూచకం పసుపు కలిపిన బియ్యం కలబోసుకుని ఒకరి నెత్తిమీద ఒకరు పోసుకున్నట్లే, వాళ్ళ జీవితాల్లో రాబోవు కష్ట సుఖాలని కూడా ఇద్దరూ కలిసే అనుభవిస్తారు" అంది ముసలావిడ. సారాకి సగం అర్థమయింది; సగం అర్థం కాలేదు. "అయినా, ఇది చాలా వేస్టు కదు, కవితా" అంది సారా. "దీనికే నువ్వు వేస్టు అంటున్నావు. ఇక్కడ ఉన్న డెకొరేషన్సుకి, ఈ సత్రం అద్దెకి, ఈ రోజు పెండ్లి ఖర్చుకి కలిసి కనీసం పదివేలయినా అయి ఉంటుంది. మళ్లీ సాయంత్రం రిసెప్షన్, డిన్నరు — వాటికి బోలెడు ఖర్చు. ఒక్క గర్ల్‌కి పెండ్లి అంటే, ఇక్కడ ముప్ఫై, నలభై వేలు ఖర్చు. ఉన్నవాళ్ళకే. అనుకో!" అంది కవిత. "మై గాడ్! వాట్ అట్టర్ వేస్ట్! నే నింకా ఇది ఏ కమ్యూనిటో హాలో అనుకున్నాను. మాలో అయితే ఇలా వేస్టు చేయం" అంది సారా. నిజమే కావచ్చునన్నట్లు తల ఊపింది కవిత. భోజనానికి పిలుపు రావడంతో భోజనాల హాలుకేసి నడిచారు అందరూ.

వరసగా టేబిల్స్ వేసి కుర్చీలు వేశారు. వంట వాళ్ళు చకచకా వడ్డించేస్తున్నారు. తిన్న వాళ్ళు తిన్నంత తింటున్నారు. మిగతాది ఆకుల్లో వదిలేసి లేస్తున్నారు. అక్కరలేని దాన్ని అలా వదిలేయడం చూసి సారా విస్తుపోయింది. వద్దని చెప్పడానికి బద్ధకమో, నామోషీయో అర్థంకాలేదు సారాకి. కవితకూడా చాలా వంటకాలు వదిలేసి స్టైలుగా తిని లేచింది. సారాకి చాలా బాధవేసింది. మిగిలిపోయిన తినుబండారాలతో కూడిన ఆకులు చుట్టచుట్టి చెత్తబుట్టలో పని వాళ్ళు పడవేయడం సారా చూడలేక పోయింది. 'అంతా క్రిమినల్ వేస్టు. హిందూ దేశంలో దారిద్ర్యం అంటారు. కాని, ఇలా అర్థం లేని ఖర్చులు చేయడమే అందుకు కారణమా? ఎందుకు కాకూడదు?' మనస్సులోనే నిట్టూర్చింది. పెండ్లికి వెళ్లినంత ఉత్సాహం, తిరిగి వచ్చిన సారాలో లేకపోవడం సరస్వతి గమనించింది. కాని, తరిచి ఏమీ అడగగదు. 'ఎవరి పద్ధతులు వాళ్ళవి. విమర్శించే హక్కు నా కెక్కడిది?' అని సారా కూడా మౌనంగా ఉండిపోయింది.

* * *

ఆ రోజే సారా వెళ్లే రోజు. మధ్యాహ్నం 12 గంటలకి ప్లేన్ డిపార్చర్. ముందు దినమే కాన్సలేట్‌కి వెళ్లిపోతా నంది సారా. కాని, సరస్వతి సారాని వెళ్ళనివ్వక రాత్రి ఇంట్లోనే ఉంచేసింది. రాత్రి పన్నెండు గంటలయినా సారా సరస్వతితో కబుర్లు చెబుతూ కూచుంది. పది గంటల వరకూ కూచున్న కవితా సబితలు వెళ్లి పడుకున్నారు—ప్రొద్దుటే లేచి చదువుకోవాలంటూ. సారా సరస్వతి నడిగి ఓ ఫామిలీ ఫోటో తీసుకుంది. తన అడ్రెసున్న కార్డు ఇచ్చింది. ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారిద్దరూ. "ఇండియాను గురించిన విషయాలు మీ ద్వారానే ఎక్కువ తెలుసుకున్నా నమ్మా!" అంటూ సారా సరస్వతి ఒళ్లో పడుకుంది. ఎంతో ఆత్మీయంగా, అమాయకంగా తన ఒళ్లో పడుకొని కబుర్లు చెబుతున్న సారాని చూసి సరస్వతి మాతృ హృదయం ఆ విదేశీయ బాలిక పట్ల అనురాగంతో నిండిపోయింది. "పదమ్మా, పడుకుందువు కాని" అంటూ బలవంతంగానే కవితా వాళ్ల గదిలోకి పంపి, తాను తన గదిలోకి నడిచింది సరస్వతి.

ప్రొద్దున్న యథాప్రకారం ఫాక్టరీకి బయలుదేరుతున్న సుందరాన్ని చూచి ఆశ్చర్యపోయింది సరస్వతి. "అదేమిటండీ! సారా వెళుతున్నది ఈ రోజే. పిల్లలంటే మంత్లీ ఎగ్జామ్స్ అంటూ వెళ్లిపోయారు. మరి మీరూ అలా వెళితే ఏం మర్యాద? ఆ పిల్లని ఏరోడ్రోమ్‌లో ఎవరు దిగబెడతారు" అంది సరస్వతి.

"బాగుంది! నాకేం పనుల్లేవా ఏమిటి! వెళ్లి కారు పంపిస్తాలే. డ్రైవర్ దింపుతాడు." ముభావంగా ఉంది సుందరం గొంతు.

"భలే వారే! మంచి మర్యాదన్నట్లే! ఆ పిల్లని ఎంత ఆదరంగా ఈ ఇంట్లోకి తీసుకొచ్చారో అంత ఆప్యాయంగానే సాగనంపాలి." సరస్వతి కంఠంలోని గంభీరతని గమనించి సుందరం కొంచెం జంకాడు. సభ్యత కాదు లెమ్మనుకున్నాడేమో, పొద్దున్న ఫాక్టరీకి రానంటూ ఫోన్ చేశాడు.

సరిగా పదకొండు గంటలకి సారా తయారైపోయింది. సరస్వతి కూడా చీర కట్టుకొని ముస్తాబయింది. ఎంత మంది ఫ్రెండ్సుని రిసీవ్ చేసుకోవాలన్నా సుందరమే వెళ్లేవాడు ఏరోడ్రోమ్‌కి. అటువంటిది ఈరోజు సరస్వతి తయారై రావడం కొంత వింత అనిపించింది సుందరానికి.

సూట్ కేసు, ఎయిర్ బాగ్ తెచ్చి వరండాలో పెట్టాడు నౌకరు కుర్రవాడు రాము. సారా ఇంకేమైనా మరిచిపోయిందా అని చూడడానికి గదిలోకి వెళ్ళింది సరస్వతి. కిటికీలో ఒక అట్టపెట్టె కనిపించింది. అరే, ఇది మర్చిపోయిందే అనుకుంటూ పైకి ఎత్తి రాబోయింది సరస్వతి. పొరబాటున తలక్రిందులుగా తీసినట్లుంది, అందులోని వస్తువులన్నీ చిందరవందరగా నేలమీద పడిపోయాయి. ఆ చప్పుడికి సారా పరుగున వచ్చింది. సరస్వతి వంగి క్రింద పడ్డ వస్తువులను చూసి ఆశ్చర్య చకితురాలయింది. సారా పక్కనే చిరునవ్వు చిందిస్తూ నిలబడింది. ఆశ్చర్యంగానే సరస్వతి ఒక మట్టెల జత, చిన్న ముక్కుపుడక, (స్ప్రింగుది), మంచి నవరము, ముగ్గులు పెట్టుకొనే గొట్టము చేతితో తీసింది. "ఏమమ్మా!ఆశ్చర్యపోతున్నావా? నేనుకూడా పెళ్లయ్యాక ఇవన్నీ వేసుకొని మిమ్మల్ని తలుచుకుంటాను. మేము హనీమూన్‌కి కూడా ఇక్కడికే వస్తామమ్మా!" అంటూ ఎంతో ఆనందంగా చెబుతున్న సారాని అలాగే హృదయానికి అదుముకుంది సరస్వతి.

ప్లేన్ టేక్—ఆఫ్ అవుతూంది. పరస్పరం వీడ్కోలు పుచ్చుకుంటున్నారు. టా టా! బై బై! చప్పుళ్లు మిన్ను ముట్టుతున్నాయి. సారా చేతులు రెండూ జోడించి "నమస్తే" అంటూ నవ్వుతూ చూసింది సరస్వతి, సుందరాలకేసి. నవ్వుతున్న సారా కండ్ల నుండి రెండు కన్నీటి ముక్కలు కూడా రాలి పడడం అదే స్థితిలో ఉన్న సరస్వతి గమనించలేదు కాని, సారాని, భార్యని మార్చి మార్చి చూస్తున్న సుందరం గమనించాడు. ★